క్లుప్తంగా

ప్రైవేటు పాఠశాలల్లో ఫ్రీ సీట్లకు దరఖాస్తు చేసుకోండి

గరుగుబిల్లి: ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లకు అర్హులైన నిరుపేద విద్యార్థులంతా దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో దత్తి అప్పలనాయుడు ఓ ప్రకటనలో శుక్రవారం కోరారు. విద్యాహక్కు చట్టం ప్రకారం 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఒకటో తరగతిలో ప్రవేశం పొందే విద్యార్థికి పట్టణ ప్రాంతాల్లో రూ.8,500లు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.7,500లు, ఏజెన్సీ ప్రాంతాల్లో రూ.5,500లను నిర్దిష్ట ఫీజుగా నిర్ణయించడం జరిగిందని, ఉచిత సీట్లు పొందే వారి ఫీజులను ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. ఐదేళ్ల వయసు నిండిన చిన్నారులంతా ఈ నెల 28వ తేదీ నుంచి మే 15వ తేదీ వరకు సీఎస్ఇ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించి, దరఖాస్తు చేసుకోవాలన్నారు. తల్లిదండ్రుల ఆధార్, విద్యార్థి పుట్టిన తేదీతో దరఖాస్తును సమర్పించాల్సి ఉంటుందన్నారు.

నేడు డీఎస్సీ అభ్యర్థులతో సమావేశం

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరు కార్యాలయం వద్ద గిరిజన డీఎస్సీ అభ్యర్థులతో శనివారం సమావేశం నిర్వహిస్తున్నట్లు గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాడంగి సాయిబాబు, పాలక రంజిత్‌కుమార్‌లు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు అభ్యర్థులంతా సమావేశానికి హాజరుకావాలన్నారు. ఆదివాసీల ప్రత్యేక డీఎస్సీ, ప్రస్తుత డీఎస్సీలో అభ్యర్థుల వయోపరిమితి పెంపు, పరీక్షకు ఇచ్చిన గడువు పెంపు తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

సివిల్ జడ్జిగా హరిప్రియ



న్యాయమూర్తి చందక హరిప్రియ

పాలకొండ రూరల్: డివిజన్ కేంద్రంలోని న్యాయస్థానం సివిల్ జడ్జిగా శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట సివిల్ కోర్టు న్యాయమూర్తి చందక హరిప్రియ బదిలీపై వచ్చారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన ఎ.విజయ్‌రాజ్‌కుమార్ బదిలీపై విజయనగరం జిల్లా గజపతినగరం వెళ్లనున్నారు. ఈ మేరకు గురువారం రాత్రి రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

నేత్ర శస్త్రచికిత్సకు తరలింపు




కురుపాం పీహెచ్‌సీ నుంచి కంటి ఆపరేషన్లకు విజయనగరం బయలుదేరిన రోగులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో ఇటీవల నిర్వహించిన నేత్ర వైద్య శిబిరాల్లో కంటి ఆపరేషన్లకు ఎంపికైన వారిని కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద నుంచి విజయనగరంలోని పుష్పగిరి కంటి ఆస్పత్రికి శుక్రవారం తరలించారు. ఉచితంగా శస్త్రచికిత్స చేయడంతో పాటు కళ్లద్దాలు, మందులు, రవాణా, భోజన సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యమిత్ర సురేష్ తదితరులు పాల్గొన్నారు.

53 మందిపై బైండోవర్ కేసులు

సీతంపేట: నవోదయం 2.0లో భాగంగా సారా కేసుల్లో పాత ముద్దాయిలు 53 మందిపై బైండోవర్ కేసులు పెట్టినట్టు పాలకొండ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.సూర్యకుమారి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీరిని హాజరుపరిచినట్లు చెప్పారు. సారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవన్నారు.

దుప్పట్లు, దోమతెరల పంపిణీ



దోమతెరలు అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని పలువురు నిరుపేదలకు పార్వతీపురం మన్యం జిల్లా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో దుప్పట్లు, దోమతెరలు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి చేతులమీదుగా 40 మందికి దోమతెరలు, దుప్పట్లు అందజేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు మంచిపల్లి శ్రీరాములు, కురుపాం ఏఎంసీ చైర్మన్ కె.కళావతి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

సీతానగరం: నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయడానికి గృహనిర్మాణశాఖ అధికార సిబ్బంది అవసరమైన చర్యలు తీసు కోవాలని మండల ప్రత్యేకాధికారి రాజేశ్వరి అన్నారు. ఈ మేరకు గెద్దలుప్పి కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను శుక్రవారం ఆమె ఎంపీడీఓతో పాటు శాఖ అధికార సిబ్బందితో కలిసి పరిశీలించారు.

● పరామర్శ..



పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శుక్రవారం పలువురు మృతుల కుటుంబాలను పరామర్శించారు. రెండు రోజుల కిందట శిలిగాం గ్రామానికి చెందిన తోయక చిరంజీవి.. ముత్యాలు గ్రామానికి చెందిన సవర రాంబాబు ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాలను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్.రాము, ఎస్.చెంచయ్య, వెంకీ, జె.సింహాచలం, ఎంపీటీసీ సభ్యుడు ఎస్.హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. – సీతంపేట

● పోలీసుల తీరుపై నిరసన..



భామిని మండలం తాలాడకు చెందిన గొర్లె భీముడు (52) ఇటీవల హత్యకు గురయ్యాడు. ఈ కేసుకు సంబంధించిన నిందితులకు పోలీసులు సహకారం అందిస్తున్నారని మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు గ్రామంలో గిరిజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఐక్యవేదిక జిల్లా నాయకుడు చల్లా శాంతారావు, కార్యవర్గ సభ్యుడు గొర్లె ప్రసాద్, మృతుడి భార్య గొర్లె భారతి మాట్లాడుతూ.. పోలీసులు విచారణ సక్రమంగా చేపట్టడం లేదని ఆరోపించారు. నిందితులను కఠినంగా శిక్షించేంత వరకు ఆందోళన ఆపేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు గేదెల కృష్ణవేణి, గొర్లె బలరాం, గేదెల రాజు, గొర్లె బుల్లోడు, పలువురు గిరిజనులు పాల్గొన్నారు. – భామిని

● ఉగ్రదాడులు తగవు..



జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడి హేయమైన చర్యగా ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అభివర్ణించారు. ఈ చర్యను ముక్తకంఠంతో అన్ని వర్గాల వారు ఖండించాలన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కోటదుర్గమ్మ దేవస్థానం నుంచి శాంతి ర్యాలీ చేపట్టారు. జనసేన పార్టీ పిలుపుతో కూటమి నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఉగ్రవాదాన్ని తిప్పికొట్టాలంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. మానవహారంగా ఏర్పడి కొవ్వొత్తులతో మృతులకు నివాళులర్పించారు. పాలకొండ రూరల్

తియ్యని పండ్ల వెనుక..

చేదు నిజం



మామిడిపండ్లు

- మామిడి పండ్లను కృత్రిమంగా మగ్గబెడుతున్న వైనం
- ఇలాంటి పండ్లు తింటే అనారోగ్యం
- అవగాహన అవసరమంటున్న వైద్యులు

పాలకొండ రూరల్: ప్రస్తుత వేసవిలో దొరికే మామిడి పండు అంటే ఇష్టపడని వారెవరూ ఉండరు. ఫలరాజుగా పేరు పొందిన మామిడికి అంత క్రేజ్ ఉంది. అయితే మామిడి పండ్లను సహజ పద్ధతుల్లో మగ్గించకుండా.. కృత్రిమంగా మగ్గించడం వల్ల ఎన్నో అనర్థాలున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఈ ఏడాది మామిడిలో ఆశించిన దిగుబడి రాలేదు. దీన్ని వ్యాపారస్తులు ఆసరాగా చేసుకుని వినియోగదారుల జేబుకు చిల్లులు పెడుతున్నారు. గతంతో పోల్చుకుంటే మామిడి దిగుబడి తగ్గడంతో ధర పెరిగింది. నాణ్యతతో కూడిన ఫలాలు ఆశించిన మేర బహిరంగ మార్కెట్‌లో లేవు. ఉన్న దిగుబడిని పరిశీలిస్తే అసలు విషయం బయటపడుతోంది. ఇటీవల వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా అకాల వర్షాలు, గాలులకు నేలరాలిన మామిడి పండ్లను సేకరించి వాటిపై ప్రమాదకర కాల్షియం కార్బైడ్‌ను ఉపయోగించి కాయలను త్వరితగతిన పక్వానికి తీసుకొస్తున్నారు. ఆరోగ్యానికి హాని కలిగించే ఈ తరహా కెమికల్స్(రసాయనాల)ను వినియోగించకూడదని వైద్య యంత్రాంగం స్పష్టం చేస్తోంది. ఆరోగ్యకర పద్ధతిలో సహజత్వానికి దగ్గరగా మామిడి కాయలను పండించాల్సి ఉన్నప్పటికీ.. వ్యాపారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. మామిడి ఫలాలకు మంచి డిమాండ్ ఉండడంతో లాభాపేక్షతో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా పండించి అమ్మకాలు చేపడుతుండంతో అవి అనారోగ్య కారకాలుగా మారుతున్నాయి. దీనిపై ఇప్పటికే ఉద్యానవన అధికారులు రైతులు, వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు అడపాదడపా తనిఖీలు చేస్తున్నారు.

పక్వానికి వచ్చినప్పుడు..

మామిడి కాయలు పక్వానికి వచ్చినప్పుడు ప్రకృతి సిద్ధంగా వాటి నుంచి ఉత్పత్తయ్యే ఇథిలియన్ కారణంగా కాయలు పండి మంచి రంగును స్వయంగా చేకూర్చుకుంటాయి. తద్వారా వచ్చిన రుచి, పోషకాలు ఆరోగ్యానికి ఉపయోగపడతాయి. అయితే కొంతమంది ఈ తరహా పద్ధతులకు స్వస్తి చెప్పి రసాయనాలతో మగ్గించి, ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఇథిలియన్ వాయువు 100 పీపీఎంలు మాత్రమే వినియోగించాల్సి ఉంటుంది. ఈ వాయువును 24 గంటలు తగిలేటట్టుగా ఐదు రోజులు కాయలను ఉంచితే సహజత్వానికి దగ్గరగా ఎటువంటి హాని లేకుండా పక్వానికి వస్తాయి. మామిడి కాయల కోత అనంతరం వంద లీటర్ల నీటికి 13 ఎంఎల్ ఎత్రిల్ కలిపి అందులో ముంచి ఆరబెడితే సహజత్వానికి దగ్గరగా పండుతాయి. మరింత సురక్షితంగా, సంప్రదాయబద్ధంగా పండించాలంటే ఇళ్లల్లో వరిగడ్డి వేసి కాయలను నిల్వ ఉంచడం ద్వారా పండించవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. రంగు చూసి మోసపోవడం, సీజన్‌కు ముందు వచ్చే పండ్లను ఆరగించడం ఆరోగ్యకరం కాదని గుర్తించాల్సి ఉంది. బహిరంగ మార్కెట్‌లో పండ్లను కొని తినే ముందు ఉప్పు నీటిలో 20 నిమిషాలు ఉంచి తిరిగి మంచి నీటితో శుభ్రంగా కడిగి అనంతరం తొక్కను తీసి తినడం మంచిదని వైద్యులు చెబుతున్నారు.

ఆరోగ్యానికి హాని..



కృత్రిమంగా కార్బైడ్ ఉపయోగించి పండించిన పండ్లు ఆరగించడం వల్ల ఆరోగ్యానికి హాని. దీని వలన కడుపులో అల్సర్, క్యాన్సర్‌తో పాటు కాలేయం, మూత్ర పిండాల వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. వినియోగదారులు శ్రేష్ఠమైన, సహజసిద్ధంగా పండే మామిడి పండ్లను ఆరగించాలి. నిషేధిత పదార్థాలను వాడి మామిడిని పండించి బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలి. – ఎస్.రవికుమార్, వైద్యాధికారి, ఎం.సింగుపురం పీహెచ్‌సీ, పాలకొండ మండలం

తేడాలను గుర్తించండిలా..

సహజంగా పండే మామిడి కొంత పసుపు, మరి కొంత ముదురు ఆకుపచ్చ రంగులో ఉండి లోపలి భాగం పరిపక్వంగా ఉంటుంది. కృత్రిమంగా పండే పండ్లు మొత్తం ఒకే విధమైన రంగును కలిగి ఉంటాయి. పైకి పండినట్టు కనిపించినా లోపల ఫలం రుచిలో తేడా ఉండి పుల్లదనం ఉంటుంది. సహజంగా పండే పండ్ల నుంచి వచ్చే వాసన ఇట్టే గుర్తించవచ్చు. కృత్రిమంగా పండించిన పండ్ల నుంచి వాసన ఏమాత్రం రాదు. సంప్రదాయబద్ధంగా పండించే పండ్లలో తగినంత చక్కెర శాతం ఏర్పడి తియ్యగా ఉంటాయి.

● అభినందనలు..

పాలకొండ





సూర్యప్రకాశరావును మన్మథరావును అభినందిస్తున్న కళావతి, విక్రాంత్

వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల పార్టీ కన్వీనర్లుగా నియమితులైన వారికి మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అభినందనలు తెలిపారు. పార్టీ స్థాపించినప్పటి నుంచి కొనసాగుతున్న వెలమల మన్మథరావు మరోమారు పార్టీ పట్టణ అధ్యక్షుడుగా నియమితులయ్యారు. అలాగే మండల కన్వీనర్‌గా కనపాక సూర్యప్రకాశరావును పార్టీ నియమించింది. ఈ మేరకు వీరిద్దరూ కళావతి, విక్రాంత్‌లను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే సూచించారు.

నియామకం..



బోదెపు శ్రీనివాసరావు

భామిని: వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడిగా వడ్డంగికి చెందిన బోదెపు శ్రీనివాసరావును పార్టీ అధిష్టానం ప్రకటించింది. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. బోదెపు శ్రీనివాసరావు గతంలో పార్టీ మండల రైతు విభాగం అధ్యక్షుడిగా పని చేశారు. ఈయన తండ్రి బోదెపు రఘుపతినాయుడు బత్తిలి సొసైటీ చైర్మన్‌గా పనిచేశారు. శ్రీనివాసరావు నియమకంపై పలువురు పార్టీ నాయకులు అభినందనలు తెలియజేశారు.

జీడిపిక్కల కొనుగోళ్లు ఇప్పుడా?



చిన్నారావు

గుమ్మలక్ష్మీపురం: వీడీవీకే(వన్ ధన్ వికాస్ కేంద్రం) ద్వారా జీడిపిక్కల కొనుగోళ్లు విడ్డూరంగా ఉందని, దొంగలు పడ్డ ఆరు నెలలకు అన్నట్లుగా ప్రభుత్వం, ప్రభుత్వాధికారుల తీరు ఉందని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో–ఆర్డినేటర్ ఎ.చిన్నారావు శుక్రవారం విమర్శించారు. జిల్లాలో గిరిజనులు విస్తారంగా సాగు చేసే జీడిమామిడి పంట కోత(ఏరివేత) జరిగి, పంట కూడా అమ్మేసుకున్నారని, ఇప్పుడు కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభించడం వెనక ఉద్దేశమేంటని ప్రశ్నించారు. నష్టానికి అమ్ముకున్న తర్వాత ఇప్పుడు కొనుగోళ్ల ప్రక్రియ చేపట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. ఏటా మన్యంలో ప్రభుత్వమే జీడిపంట కొనుగోలు చేయాలని కోరడం జరుగుతోందని, మార్చి మొదటి వారంలో కొనుగోలు చేయాల్సి ఉండగా పంట చివరిలో ఏప్రిల్‌లో కొనుగోళ్ల ఏంటన్నారు. గిరిజన రైతులపై ప్రభుత్వం, ప్రభుత్వాధికారులు చూపే 'సవతి తల్లి' ప్రేమకు పరాకాష్ట ఇది అని అనక తప్పదన్నారు.

కూటమి నాయకులకే గోశాలలా?

కొమరాడ: కూటమి నాయకులకు ఒక్కరికే గోశాలలు మంజూరు చేయడంపై విక్రంపురం రైతులు పుర్రి తాతబాబు, గర్భాపు జగన్నాథం తదితరులు మండిపడుతున్నారు. వాస్తవానికి పశువులు ఉన్న రైతులకు గోశాలలు ఇవ్వాలని ప్రభుత్వం చెబితే మండలంలోని కూటమి పార్టీల నాయకులు మాత్రం వారి పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలకే గోశాలలు కట్టబెట్టారని ఆరోపించారు. పశువులు కలిగిన తాము గోశాలల కోసం దరఖాస్తు చేసుకున్నా రాలేదని, టీడీపీ నాయకులు మాత్రం తమ బైకులు, కార్లు పెట్టుకునేందుకు గోశాలలు మంజూరు చేసుకుని నిర్మాణం చేసుకున్నారన్నారు. అలాగే కొమరాడలో పశువైద్యుడు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, గోశాల కావాలని వెళ్తే కూటమి నాయకుల సిఫార్సులు అడుగుతున్నారన్నారు. అధికారులు స్పందించి, అర్హులకే గోశాలలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

న్యాయం చేయాలి..



నిరసన తెలియజేస్తున్న మినిస్టీరియల్ ఉద్యోగులు

పాలకొండ రూరల్: ఏపీ మినిస్టీరియల్ ఉద్యోగులకు న్యాయం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు కిల్లారి నారాయణరావు కోరారు. ఎంపీడీఓ పదోన్నతుల సమయంలో పంచాయతీరాజ్ పరిపాలాధికారులకు (ఏఓ) 34, విస్తరణాధికారులకు 33, గ్రూప్–1 ద్వారా వచ్చిన వారికి 3 శాతం రిజర్వేషన్లు ఉండేవన్నారు. అయితే తాజాగా విడుదల చేసిన జీఓ 35 వల్ల తమకు నష్టం కలుగుతుందని చెప్పారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నరసింహులు, అసోసియేట్ అధ్యక్షుడు బీవీఆర్ ప్రసాద్, ఎంపీడీఓ రంగారావుతో పాటు డివిజన్ పరిధిలోని 8 మండలాల సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



ర్యాలీలో సచివాలయ సిబ్బంది, ఆశ కార్యకర్తలు

గరుగుబిల్లి: ఫ్రైడే డ్రైడేలో భాగంగా మండలంలోని ఉల్లిబద్ర గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ సచివాలయ సిబ్బంది, ఆశ కార్యకర్తలు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు సూచించారు. కాలువల్లో చెత్తాచెదారం వేయకుండా చూడాలన్నారు. అనంతరం దోమల వ్యాప్తిని అరికడదాం..ప్రజారోగ్యాన్ని రక్షించుకుందామని నినాదాలు చేశారు.

మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ

పాలకొండ: ప్రపంచ మలేరియా నివారణ దినం సందర్భంగా శుక్రవారం పట్టణంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి కె. తేజ్ రతన్‌రాజ్ మాట్లాడుతూ.. దోమకాటు వల్ల కలిగే నష్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ సిబ్బంది ఎం. మోహనరావు, హెచ్‌వీ రమణమ్మ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రం..

భామిని: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే మలేరియాను నివారించగలమని వైద్యులు స్పష్టం చేశారు. బాలేరు, బత్తిలి, భామినిలో వైద్యాధికారులు జి. శివకుమార్, కె. దామోదరరావు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మలేరియాను తరిమికొడదాం..

వీరఘట్టం: పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడు అంటురోగాలు ప్రబలవని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ బి. ప్రదీప్‌కుమార్ అన్నారు. మలేరియా నివారణ దినం సందర్భంగా సిబ్బందితో కలిసి మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మలేరియాను తరిమికొట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇళ్ల పరిసరాలు.. పూల కుండీల్లో మురుగునీరు లేకుండా చూడాలని సూచించారు. అలాగే ఖాళీ కొబ్బరి బోండాలు, టైర్లు ఉంటే దోమలు వృద్ధి చెందుతాయని, ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ర్యాలీలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



భామిని: బాలేరులో వైద్యాధికారి శివకుమార్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ర్యాలీ



వీరఘట్టం: మలేరియాపై అవగాహన ర్యాలీ చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

అవగాహన ర్యాలీ..

సీతంపేట: మలేరియా మహమ్మారిని తరిమికొట్టాలని వైద్యులు పిలుపునిచ్చారు. మలేరియా నివారణ శాఖ, వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో స్థానిక అడ్వంచర్ పార్కు నుంచి ఏరియా ఆస్పత్రి వరకు ర్యాలీ సాగింది. అనంతరం బస్టాండ్ వద్ద మానవహారం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణారావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయపార్వతీ, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు, సబ్‌యూనిట్ ఆఫీసర్ జె.మోహన్‌రావు, దోనుబాయి పీహెచ్‌సీ వైద్యాధికారి భానుప్రతాప్, ఎంటీఎస్ ఝాన్సీరాణి, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో అధిగమిద్దాం..

పాలకొండ రూరల్: మలేరియాను అవగాహనతో అధిగమిద్దామని మండలంలోని అన్నవరం, ఎం.సింగుపురం పీహెచ్‌సీల వైద్యాధికారులు వి.కమల్‌నాథ్, ఎస్.రవికుమార్ అన్నారు. ప్రపంచ మలేరియా నివారణ దినం సందర్భంగా గ్రామాల్లో అవగాహన ర్యాలీలు చేపట్టారు.

గుమ్మలక్ష్మీపురం: మలేరియా నిర్మూలనే ప్రతి ఒక్కరి ధ్యేయం కావాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవంలో భాగంగా మండలంలోని తాడికొండ పీహెచ్‌సీ వైద్యారోగ్య సిబ్బంది గ్రామంలో అవగాహన ర్యాలీ శుక్రవారం చేపట్టారు. వైద్యులు ఎం.బుద్ధేశ్వరరావు, ఎ.అభిలాష్‌లు తొలుత మలేరియా ఏ విధంగా వస్తుంది, దాని నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. దోమల ద్వారా వ్యాప్తి చెందే మలేరియా నిర్మూలించాలంటే పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అనవసరపు నీటి నిల్వలు ఉండకుండా, దోమలు వృద్ధి చెందకుండా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో పద్మ, హెల్త్ సూపర్‌వైజర్లు, శ్రీను, యర్రాయమ్మ తదితరులు పాల్గొన్నారు.



పాలకొండ: ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

జియ్యమ్మవలస: మలేరియా వ్యాధి అంతం మనతోనే సాధ్యమని, అవగాహనతోనే మలేరియాను నివారించవచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిప్రసన్న అన్నారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా సోకే ముందు చలిజ్వరం, తలనొప్పి ప్రారంభమవుతుందని, ఒకరి నుంచి ఇంకొకరికి వ్యాప్తి చెందే ఈ వ్యాధి నిర్మూలనకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నివాస ప్రాంతాలకు దగ్గరలోని ఖాళీ ప్రదేశాల్లో ఖాళీ కొబ్బరిబోండాలు, టైర్లలో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు.

గరుగుబిల్లి: మలేరియా నియంత్రణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మన పరిసరాల్లో నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో దోమల లార్వా పెరుగుతుందని, నీటి నిల్వలు లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల నివారణ చర్యల్లో భాగంగా దోమల నివారణ మందును స్ప్రే చేయాలన్నారు. కార్యక్రమంలో హోమియో వైద్యాధికారి కాసులవర్మ తదితరులు పాల్గొన్నారు.



సీతంపేట: ర్యాలీ చేస్తున్న సిబ్బంది



గుమ్మలక్ష్మీపురం: అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి



జియ్యమ్మవలస పీహెచ్‌సీ వద్ద వైద్యారోగ్య సిబ్బంది ర్యాలీ



గరుగుబిల్లిలో ర్యాలీలో మలేరియా నిర్మూలనకు పాటుపడాలని నినదిస్తున్న వైద్యాధికారి సంతోష్‌కుమార్ తదితరులు



పాలకొండ రూరల్: అన్నవరంలో ర్యాలీ చేపడుతున్న వైద్యులు, సిబ్బంది